క్లుప్తంగా

13 గంటల పని విధానాన్ని ఉపసంహరించుకోవాలి



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఇటీవల రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదించిన 13 గంటల పని విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ, ఏఐటీయూసీ డిమాండ్ చేశాయి. సోమవారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని కోరుతూ పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విశాఖ ఉక్కును ప్రైవేట్‌కు అప్పగించరాదన్నారు. ఆటో వర్కర్లకు వాహన మిత్ర సాయాన్ని రూ.30 వేలకు పెంచాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులకు, హమాలీ వర్కర్స్‌కు సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, సీఐటీయ నగర అధ్యక్ష, కార్యదర్శులు వై.నగేష్, ఆర్.నరసింహులు పాల్గొన్నారు.

25లోపు సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెబాట



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

కర్నూలు(సెంట్రల్): దీర్ఘకాలికంగా పేరుకుపోయిన తమ సమస్యలను సెప్టెంబర్ 25వ తేదీ లోపు పరిష్కరించకుంటే సమ్మెలోకి వెళ్తామని ఏపీ విద్యుత్ ఉద్యోగులు, కార్మిక సంఘాల జేఏసీ హెచ్చరించింది. తమ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15 నుంచి దశల వారీగా పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని, ఈ నెల 25వ తేదీన కార్మిక సంఘాల జేఏసీ సమావేశం జరుగుతుందని, అందులో సమ్మెపై నిర్ణయం తీసుకుంటామని కర్నూలు జిల్లా జేఏసీ చైర్మన్ సతీష్‌కుమార్ స్పష్టం చేశారు. సోమవారం విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో విద్యుత్‌భవన్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీగా వచ్చి ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

28న వరల్డ్ హార్ట్ డే



కలెక్టర్ డాక్టర్ ఎ.సిరిని కలిసిన కర్నూలు హార్ట్ ఫౌండేషన్ సభ్యులు

కర్నూలు (హాస్పిటల్): ప్రపంచ హృదయ దినోత్సవం ఈ నెల 28న ఘనంగా నిర్వహించనున్నట్లు కర్నూలు హార్ట్ ఫౌండేషన్ సెక్రటరీ, ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ పి.చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఉదయం ఫౌండేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ భవానీప్రసాద్, డాక్టర్ ఎ.వసంత కుమార్‌లతో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరిని కలిశారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ అధ్యక్షులుగా ఉన్న కలెక్టర్‌ను ప్రపంచ హృద్రోగ దినోత్సవ కార్యక్రమానికి ఆహ్వానించారు.

పాలిచ్చే తల్లులకు ప్రత్యేక గది

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో.. శిశువులకు పాలు పట్టే తల్లులకు ప్రత్యేక గదిని సోమవారం సాయంత్రం కమిషనర్ పి.విశ్వనాథ్ ప్రారంభించారు. కమిషనర్ మాట్లాడుతూ.. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే బాలింతలు క్యూలైన్లలో వేచి ఉండే సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వారి కోసం ప్రత్యేక గది ఏర్పాటు చేసి సౌకర్యవంతంగా ఫర్నీచర్, ఫ్లోరింగ్, కర్టెన్లు, ఫ్యాన్ వంటి సౌకర్యాలు కల్పించామన్నారు. అదనపు, డిప్యూటీ కమిషనర్లు ఆర్జీవీ క్రిష్ణ, సతీష్‌కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

చోరీ ఘటనపై ఎస్పీకి ఫిర్యాదు

కర్నూల్ అగ్రికల్చర్: తన ఇంట్లో 11.8 తులాల బంగారు, రూ.15 వేల నగదు చోరీ జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయడం లేదని తెలుగు గురుస్వామి అనే వ్యక్తి జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు ఫిర్యాదు చేశారు. వివరాలు.. గురుస్వామి కుటుంబం కల్లూరులోని తెలుగు వీధిలో హౌస్ నంబర్ 73/23లో నివాసం ఉంటున్నారు. ఈనెల 19న ఉదయం గురుస్వామి కోడుమూరుకు, భార్య చేపల అమ్మకానికి, పిల్లలు స్కూలుకు వెళ్లారు. ఎప్పటిలాగే ఇంటి తాళంచెవిని బాత్రూంలో ఉంచారు. గుర్తు తెలియని దుండగుడు తాళం చెవి తీసుకొని ఇంట్లోకి ప్రవేశించి బంగారం, నగదు చోరీ చేశారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన గురుస్వామి భార్య దొంగతనం జరిగిందని నిర్ధారించుకుని భర్తకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. చోరీపై దంపతులు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మరుసటి రోజు నిపుణులు వచ్చి వేలి ముద్రలు సేకరించారు. అయినా పోలీసులు కేసు నమోదు చేయకపోవడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేసు విచారణ జరిపి దుండగుడిని పట్టుకుని సొమ్ము తిరిగి వచ్చేలా చూడాలని గురుస్వామి సోమవారం జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు.





● యార్డు నిండా కుళ్లిన ఉల్లి!

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో కుళ్లిన ఉల్లిగడ్డలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. యార్డులో మార్క్‌ఫెడ్ రైతుల నుంచి కొనుగోలు చేసిన ఉల్లి 1900 టన్నులు పేరుకుపోయి ఉంది. ఇది వారం పది రోజులుగా నిల్వ ఉండటం వల్ల కుళ్లి నీళ్లారుతోంది. దీన్ని డంప్‌యార్డుకు తరలించాల్సి ఉన్నప్పటికీ ఇటు మార్కెట్ కమిటీ అధికారులు, అటు నగరపాలక సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదు. మార్కెట్‌లో ఎటూ చూసినా కుళ్లిన ఉల్లి నిల్వలే కనిపిస్తున్నాయి. ఉల్లి నిల్వలు పేరుకపోవడం వల్ల ఇతర వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలకు అవకాశం లేకుండా పోతోంది. రైతులు, వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు, కార్మికులు దుర్గంధంలోనే ముక్కు మూసుకొని పనులు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా కుళ్లిన ఉల్లిని బయటికి తరలించడంపై దృష్టి సారించాలని కమీషన్ ఏజెంట్లు తదితరులు కోరుతున్నారు.



మార్కెట్ యార్డులో కుళ్లిన ఉల్లి నిల్వలు

రైతుబజారులో పేరుకుపోయిన వ్యర్థాలు

● కుళ్లి దుర్గంధం వెదజల్లుతున్న వైనం ● ఇబ్బందులు పడుతున్న రైతులు, ప్రజలు







రైతుబజారులో పేరుకుపోయిన కూరగాయల వ్యర్థాలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు సి.క్యాంపు రైతు బజారు అస్తవ్యస్తంగా తయారైంది. రైతుబజారులో ఉత్పన్నమైన వ్యర్థాలను నగరపాలక సంస్థ శానిటరీ సిబ్బంది ఎప్పటికప్పుడు డంప్ యార్డుకు తరలించాలి. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో కుళ్లిపోతున్న ఉల్లిగడ్డలను డంప్ యార్డుకు తరలిస్తున్నామనే కారణంతో రైతుబజారులోని వ్యర్థాలను తరలించడం లేదు. దీంతో రెండు, మూడు రోజులుగా కూరగాయలు, ఆకు కూరలు, ఇతర వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయాయి. వాటిలో పందులు స్వైరవిహారం చేస్తుండటంతో వినియోగదారులు, రైతులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కుళ్లి దుర్గంధం వెదజల్లుతున్న వ్యర్థాల ప్రక్కనే రైతులు కూర్చొని కూరగాయలు అమ్ముకుంటున్నారు. వినియోగదారులు ముక్కు మూసుకొని తిరుగుతున్నారు. నగరపాలక సంస్థ శానిటరీ సిబ్బంది వ్యర్థాలను తరలించకపోవడం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడినట్లు సమాచారం.

నేడు రైతుబజారుకు సెలవు

రైతుబజారులో ఎటూ చూసిన వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతుండటంతో మంగళవారం క్లీనింగ్ పనులు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా రైతుబజారుకు ఒకరోజు సెలవు ప్రకటించినట్లు ఎస్టేటు అధికారి కళ్యాణి, హార్టికల్చర్ కన్సల్టెంటు శివకుమార్ తెలిపారు. రైతుబజారును క్లీనింగ్ కోసం బంద్ చేస్తున్న విషయాన్ని రైతులు, వినియోగదారులు గమనించాలని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి యథావిధిగా రైతుబజారు పనిచేస్తుందని పేర్కొన్నారు.

తలసరి ఆదాయం పెంచేలా చర్యలు



హాజరైన అధికారులు



మాట్లాడుతున్న కలెక్టర్

- డిసెంబర్‌కల్లా టమాట ప్రాసెసింగ్ యూనిట్
- ఈ-క్రాప్ బుకింగ్ పూర్తి చేయండి
- అక్షరాస్యత రేటు పెంచేందుకు కృషి

కర్నూలు (సెంట్రల్): జిల్లాలో తలసరి ఆదాయం పెంచే విధంగా ప్రైమరీ సెక్టార్లను అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఇటీవల విజయవాడలో నిర్వహించిన కలెక్టర్ల సమావేశం అజెండాపై సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా తలసరి ఆదాయం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు యూరియా వాడకం తగ్గించేలా చూడాలని, డిసెంబర్ కల్లా టమాట ప్రాసెసింగ్ యూనిట్ పూర్తి చేయాలని ఆదేశించారు. తడకనపల్లిలో పాడిపశువుల హాస్టల్ ఏర్పాటు చేయనున్నామని, అలాగే పశువుల హాస్టళ్ల ఏర్పాటుకు మరో 5 గ్రామాలను ఎంపిక చేయాలన్నారు. భూసార పరీక్షలు నిర్వహించాలని, అక్టోబర్ 15 లోగా క్రాప్‌బుకింగ్ పూర్తి చేయాలని సూచించారు. వసతి గృహాల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అక్షరాస్యత రేటు పెంచే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి శాఖకు సంబంధించి పథకాల గురించి పోస్టర్లు, వీడియోలను డీఆర్‌డీఏ వారికి ఇవ్వాలన్నారు. డీఆర్‌ఓ సి.వెంకటనారాయణమ్మ, ఇన్‌చార్జ్ సీపీఓ భారతి, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డీఆర్‌ఏ పీడీ రమణారెడ్డి, హౌసింగ్ పీడీ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వన్‌స్టాప్ సెంటర్‌తో మహిళలకు తక్షణ సాయం

కర్నూలు(సెంట్రల్): ఆపదలో ఉన్న బాలికలు, మహిళలకు వన్‌స్టాప్ సెంటర్ ఆశ్రయం కల్పించి ఆదుకుంటుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఐసీడీఎస్ రూపొందించిన మిషన్ శక్తి పథకానికి సంబంధించి వన్‌స్టాప్ సెంటర్ పోస్టర్‌ను కలెక్టర్, అధికారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో వన్ స్టాప్ సెంటర్–మిషన్ శక్తి ద్వారా గృహహింస, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, యాసిడ్‌దాడులు, మహిళల ఆక్రమ రవాణా, కిడ్నాప్‌లు, సైబర్ నేరాలు, బ్యాల వివాహాలు జరిగిన సందర్భాల్లో బాధితులకు చట్టపరమైన, వైద్య, మానసిక సలహా, పునరావాస సదుపాయం కల్పించబడుతుందన్నారు. తక్షణ సాయం కోసం బాలికలు, మహిళలు వన్‌స్టాప్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని, బాధిత మహిళలు మౌనంగా ఉండి కష్టాలను భరించకుండా ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. జేసీ డాక్టర్ బి.నవ్య, ఐసీడీఎస్ పీడీ పి.విజయ, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, మహిళా పోలీసు స్టేషన్ సీఐ విజయలక్ష్మీ, వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ పి.మేరీ స్వర్ణలత, జోష్టనా పాల్గొన్నారు.

వీఆర్‌ఏలకు పదోన్నతులు కల్పించాలి

కర్నూలు(సెంట్రల్): వీఆర్‌ఏలుగా పని చేస్తూ ఉన్నత విద్యను అభ్యసించిన వారికి వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించాలని ఏపీ గ్రామ సహాయకుల సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో తమ సమస్యల పరిష్కారం కోసం వీఆర్‌ఏలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీఆర్‌ఏలకు పే స్కూల్ అమలు చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. డ్రైవర్స్, అటెండర్స్, వాచ్‌మన్‌లు తదితర పోస్టులకు పదోన్నతుల ద్వారా వీఆర్‌ఏలను నియమించాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రస్తుతం ఇస్తున్న రూ.10.5 వేలు ఏమాత్రం సరిపోవడం లేదని చెప్పారు. కర్నూలు మండల కార్యదర్శి శ్రీనివాసులు, వీఆర్‌ఏలు లక్ష్మీదేవి, వెంకటేశ్వర్లు, సరస్వతీ, దస్తగిరి, వెంకటేశ్వర్లు, దాదాబాషా, కృష్ణ, మద్దిలేటి పాల్గొన్నారు.

నేడు మెప్మా ఆర్పీల సంఘం జిల్లా మహాసభలు

కర్నూలు(సెంట్రల్): మెప్మా ఆర్పీల సంఘం జిల్లా మహాసభలు మంగళవారం కల్లూరులోని సూర్య నారాయణ భవన్‌లో జరుగనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.ఉమాదేవి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి, శ్రామిక మహిళా కన్వీనర్ నిర్మల ముఖ్య అతిథులుగా హాజరవుతారని వెల్లడించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

కర్నూలు (టౌన్): నగర ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్దేశిత గడువులోపు పరిష్కరించడమే తొలి ప్రాధాన్యత అని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అన్నారు. సోమవారం స్థానిక నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజల నుంచి 54 అర్జీలు వచ్చాయని, పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అదనపు కమిషనర్ ఆర్జీవీ క్రిష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం

కర్నూలు కల్చరల్: డ్రగ్స్ రహిత దేశ నిర్మాణమే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ ముందుకు సాగుతున్నారని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. నశా ముక్త భారత్ కోసం సోమవారం బీజేవైఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నమో మారథాన్‌ను రాజ్‌విహార్ సెంటర్‌లో టీజీ వెంకటేష్, బీజేపీ అధికార ప్రతినిధి డాక్టర్ వినూషారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజీ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రధాని యుద్ధం ప్రకటించారన్నారు. ఇందులో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. వినూషా రెడ్డి మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత సమాజం రూపొందడానికి అందరూ బాధ్యత తీసుకోవాలన్నారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సునీల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కేశవ రామ్ చౌదరి, బీజేపీ నాయకులు రామస్వామి, రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వాలి

కర్నూలు కల్చరల్: ఫీజులతో సంబంధం లేకుండా విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వాలని, లోకాయుక్త ఆదేశాలు అమలు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆర్‌యూ కన్వీనర్ రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆర్‌యూలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్ నాయుడుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన దాదాపు రూ.6400 కోట్ల ఫీజు బకాయిలను విడుదల చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం చేస్తున్న తప్పులకు విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడకూడదన్నారు. ఇదే విషయంపై ఉప లోకాయుక్త వారు సుమోటోగా కేసును పరిగణలోకి తీసుకొని ఫీజులతో సంబంధం లేకుండా సర్టిఫికెట్లు జారీ చేయాలని కోరారు. లేని పక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సందీప్ పాయక్, తదితరులు వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

ఎంఈఓను సస్పెండ్ చేయాలి

కర్నూలు(సెంట్రల్): మామూళ్ల మత్తులో జోగుతూ విద్యార్థుల ప్రాణాలను పణంగా పెడుతున్న ఎమ్మిగనూరు ఎంఈఓ ఆంజనేయులును సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. సోమవారం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు ఉదయ్, శేఖర్, ఖాజా, ఆఫ్రిది, రఘునాథ్ మాట్లాడుతూ.. ఎమ్మిగనూరులో 42 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నా ఒక్క దానిలో కూడా ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదన్నారు. అనేక పాఠశాలలకు సొంత భవనాలు లేవని, పాతబడిన భవనాల్లో నిర్వహిస్తున్నారని, అవి ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. అయినా ఎంఈఓ మాత్రం వాటిని కొనసాగిస్తూనే ఉన్నారన్నారు. కార్యక్రమంలో రఫీ, నవీన్, అశోక్, కలం వీరేష్, నాయుడు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యం కోసం వైద్య శిబిరాలు

కర్నూలు(హాస్పిటల్): ఆరోగ్యవంతమైన మహిళ – శక్తివంతమైన కుటుంబం అనే నినాదంతో సమగ్ర ఆరోగ్య సేవా కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద మహిళల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు డెమో శ్రీనివాసులు శెట్టి చెప్పారు. స్థానిక ఎర్రబురుజు యూపీహెచ్‌సీలో 'స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్'లో భాగంగా నిర్వహించిన వైద్య శిబిరంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రత్యేక వైద్య శిబిరాలు కొనసాగుతాయని, మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్యాధికారి డాక్టర్ తేజస్విని, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన పెంచుకోవాలి

కర్నూలు సిటీ: ప్రతి పౌరుడు జీఎస్టీపై అవగహన పెంచుకోవాలని క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ జి.శ్రీనివాస్ సూచించారు. సోమవారం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీలో అర్థశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో నూతన జీఎస్టీ భారత ఆర్థిక వ్యవస్థపై ఎలాంటి ప్రభావం చూపనుంది అనే అంశంపై సదస్సు నిర్వహించగా రిజిస్ట్రార్ ఉపన్యాసం ఇచ్చారు. జీఎస్టీ 2.0 స్లాబుల గురించి అధ్యాపకులు విద్యార్థులకు వివరించాలన్నారు. జీఎస్టీ కడప రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.సుధాకర్ హాజరై ప్రసంగించారు. డాక్టర్ జి.ఎల్లాకృష్ణ, బి.ఆర్ ప్రసాద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.











వీఆర్ కాలనీలో.. పాత కల్లూరులో.., అబ్బాస్ నగర్‌లో.., మహావీర్ నగర్‌లో.., సత్యసాయి మందిరంలో..

జగన్మాత నమోస్తుతే..



నిమిషాంబ దేవిని దర్శించుకున్న భక్తులు



లలితా పీఠం వద్ద రథోత్సవం



లలితా పీఠంలో పూజల్లో పాల్గొన్న చిన్నారులు

కర్నూలు కల్చరల్: జిల్లా వ్యాప్తంగా దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం మొదటి రోజు అమ్మవారిని వివిధ రూపాల్లో ప్రత్యేకంగా అలకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తుల కోలాహలంతో ఆలయాలన్నీ సందడిగా మారాయి. పలు ఆలయాల్లో బొమ్మల కొలువులు ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. గోపూజ, హోమాలు, అభిషేకాలు, సామూహిక కుంకుమార్చనలు, లలితా సహస్రనామ పారాయణం, బుర్రకథ, హరికథ, కోలాటాలు, అన్నమాచార్య సంకీర్తనలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకొంది. కర్నూలు నగరంతో పాటు, శ్రీశైలం, నంద్యాల, మహానంది, ఆదోని, డోన్, పత్తికొండ, ఎమ్మిగనూరు, నందవరం, నందికొట్కూరు, బనగాపల్లె, ఆత్మకూరు, ఆలూరు, పాణ్యం, నాగలాపురం సుంకులాపరమేశ్వరి ఆలయం, వెంకాయపల్లి ఎల్లమ్మ ఆలయం, నన్నూరు సరస్వతి దేవి ఆలయం, కర్నూలు చిన్న అమ్మవారి శాల, పెద్ద అమ్మవారి శాల, గీతా మందిరం, ఓల్డ్‌సిటీలోని లలితా పీఠం, సప్తగిరి నగర్ చౌడేశ్వరీ దేవి ఆలయం, గోదా గోకులంలో శరన్నవ రాత్రి ఉత్సవాలువైభవోపేతంగాప్రారంభమయ్యాయి.









బిర్లాగేట్‌లో.. కడక్‌పురాలో.., సప్తగిరి నగర్ చౌడేశ్వరీ దేవి ఆలయంలో.., లలితా పీఠంలో..









రాజరాజేశ్వరిగా.., మించిన్ బజార్‌లో.., కల్లూరు కన్యకాపరమేశ్వరి ఆలయంలో.., చౌడేశ్వరీ ఆలయంలో..

రెండో మెరిట్ జాబితా కోసం ఎదురుచూపులు

- ఎంపిక కాని కానిస్టేబుల్ అభ్యర్థుల ఆశలు
- డీఎస్సీలోనూ ఎంపికైన కానిస్టేబుల్ అభ్యర్థులు
- ఉపాధ్యాయులుగా వెళ్లిన అధిక శాతం అభ్యర్థులు

కర్నూలు(హాస్పిటల్): ఏపీఎస్ఎల్‌పీఆర్‌బీ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ రెండవ మెరిట్ జాబితా కోసం అధిక సంఖ్యలో అభ్యర్థులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇటీవల విడుదలైన పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో అర్హత సాధించి ఫైనల్ కట్ ఆఫ్ మార్క్సులో 0.5, 1, 2, 3 మార్కుల్లో పలువురు అభ్యర్థులు ఉద్యోగాన్ని కోల్పోయారు. ఇదిలాఉండగా ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో కొందరు కానిస్టేబుల్ అభ్యర్థులు సైతం ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. దీంతో వారు కానిస్టేబుల్ పోస్టుకు బదులు ఉపాధ్యాయ వృత్తినే ఎన్నుకున్నారు. ఈ కారణంగా వారి స్థానాలు ఖాళీగా మారాయి. ఇలా ఖాళీగా ఉన్న పోస్టులను బ్యాక్‌లాగ్‌గా మార్చకుండా మెరిట్ జాబితాలో తదుపరి అభ్యర్థులకు అవకాశం కల్పించాలని పలువురు అభ్యర్థులు కోరుతున్నారు. ఈ మేరకు ప్రభుత్వం కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ రెండవ జాబితా విడుదల చేయాలని కోరుతున్నారు. వీటితో పాటు ఇతర ఉద్యోగాలకు ఎంపికై పోలీస్ కానిస్టేబుల్‌లో కూడా నమోదైన వారి కోసం వారు అన్ విల్లింగ్ కోసం ప్రెస్‌నోట్ జారీ చేయాలని నిరుద్యోగులుగా మిగిలిపోయిన కానిస్టేబుల్ అభ్యర్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. గతంలోనూ రెండు పోటీ పరీక్షల్లో పాల్గొని రెండింటిలోనూ అర్హత పొంది ఒక దానిలో ఖాళీలు ఏర్పడితే వాటిని తదుపరి మెరిట్ జాబితాలో ఉన్న వారితో భర్తీ చేసేవారు. ఇదే విధంగా ఒకటి, రెండు మార్కులతో ఉద్యోగాలు కోల్పోయిన తమకు అవకాశం కల్పించాలని వారు కోరుతున్నారు. యూపీఎస్సీ నోటిఫికేషన్, సచివాలయం నోటిఫికేషన్, డీఎస్సీ ఫలితాల్లో కూడా ఇలాంటి విషయాల్లో తదుపరి అభ్యర్థులకు అనుమతి ఇచ్చారంటూ గుర్తు చేస్తున్నారు.

ఉల్చాలలో తాగునీటి సమస్య పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న డీవైఎఫ్ఐ, ఉల్చాల గ్రామస్తులు

కర్నూలు(సెంట్రల్): ఉల్చాల గ్రామంలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్దుల్లా డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఉల్చాల వాసులు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. కర్నూలు నగరానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉండి 10 వేల జనాభా కలిగిన మేజర్ గ్రామ పంచాయతీలో సమస్యలను పరిష్కరించడంలో అధికారులు వైఫల్యం చెందారని ఆరోపించారు. గ్రామంలో 10 నుంచి 15 రోజులకోసారి నీరు వస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. సమీపంలోని భవాపురం నుంచి మంచినీటి పైపులైన్ వేయాలని కోరుతున్నా ప్రభు త్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. వెంటనే గ్రామానికి పైప్‌లైన్ వేసి వాటర్ స్టోరేజ్ ట్యాంకును పూర్తి చేసి వాడుకలోకి తేవాలని కోరారు. లేదంటే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ ఏ.సిరికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ప్రకాష్, హరికిషన్‌రెడ్డి, రాము, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.